ఆంధ్రజ్యోతి ABN
We Report You Decide

# యువతరానికి స్ఫూర్తి అక్కినేని - తోటకూర ప్రసాద్

Updated : 21-Dec-2015 : 11:39



"అక్కినేని నాగేశ్వరరావు మహానటుడు. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్ని పోషించి మహోన్నత స్థానానికి చేరుకున్నారు. యువతరానికి ఆయన స్ఫూర్తి ప్రదాత. ఆయన స్ఫూర్తితోనే ఈ సంస్థను మొదలుపెట్టాం. గతేడాది డిసెంబర్‌లో ఏఎన్నార్ కాలేజీలో తొలిసారి వేడుకలను నిర్వహించాం. అందులో భాగంగానే ఏఎన్నార్ శిలావిగ్రహాన్ని ఆవిష్కరించాం. మద్రాసులో వేళ్లూనుకున్న తెలుగు పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడానికి ఎక్కువగా కృషి చేసిన వ్యక్తి ఆయన. అందుకే రెండో వార్షికోత్సవ వేడుకలను ఇక్కడ నిర్వహించాం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన తమిళనాడు గవర్నర్ రోశయ్యగారు అనారోగ్యం కారణంగా రాలేకపోయారు'' అని అక్కినేని ఫౌండేషన ఆఫ్ అమెరికా (ఎఎఫ్‌ఎ) అధ్యక్షుడు డా. ప్రసాద్ తోటకూర తెలిపారు. ఎఎఫ్‌ఎ తరఫున 'అక్కినేని ఇంటర్నేషనల్ రెండో వార్షిక అవార్డుల గలా' కార్యక్రమం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఎఫ్‌ఎనసీసీలో జరిగింది. అక్కినేని కుమార్తె నాగసుశీల, మనవళ్ళు సుమంత్, సుశాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అక్కినేని గోల్డెన్ హీరోయిన్లుగా సీనియర్ నటీమణులు కృష్ణవేణి, జమునను సత్కరించారు. అలాగే 'రంగస్థల రత్న' బిరుదుతో ప్రజా నటుడు కర్ణాటి లక్ష్మీనరసయ్యను, 'విద్యారత్న' పురస్కారంతో విద్యావేత్త

చుక్కారామయ్యను, ‘విశిష్ట వ్యాపారరత్న’గా ఏవీఆర్ చౌదరిని, ‘వైద్యరత్న’గా డా.గుల్లా సూర్యప్రకాష్‌ను, ‘సేవా రత్న’గా డా.సునీతా కృష్ణనను, ‘కళా రత్న’గా నల్లా విజయ్‌ను, ‘యువ రత్న’గా పూర్ణ మలావతను శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

ఈ అవార్డుల్లో భాగంగా ‘యువతరాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు – పరిష్కార మార్గాలు’ అనే అంశంతో లఘు చిత్రాల పోటీలను నిర్వహించి తొలి మూడు ఉత్తమ లఘుచిత్రాలకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగసుశీల మాట్లాడుతూ “మా నాన్నగారు యు.ఎస్. వెళ్ళిన ప్రతిసారీ వీళ్ళందరూ ఆయన్ని బాగోగులు చూసుకున్నారు. ఆయన చివరి పుట్టినరోజుకు యు.ఎస్. నుంచి వీళ్ళందరూ వచ్చారు. నాన్నగారి చివరి రోజుల్లో వీరితో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మా నాన్నగారు మాకెంతో ప్రేమను పంచారు. ఆయన కూతురిగా మరెన్నో జన్మలు కావాలనిపిస్తోంది. భయమన్నది తెలియని వ్యక్తిత్వం నాన్నగారి సొంతం. ట్రూలీ ట్రూలీ ఏఎన్నార్ లివ్స్ ఆన్. ఆయన అనుకున్న స్థాయిని చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డారు. అయితే ఆ కష్టంలో తన చిరునవ్వును మర్చిపోని వ్యక్తి ఏఎన్నార్‌గారు. తన చివరి క్షణం వరకూ ఆయన చాలా ఆనందంగా తనకు నచ్చిన పని చేసుకుంటూ ఉన్నారు’’ అని అన్నారు.

పురస్కారాన్ని అందుకున్న కర్ణాటి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ “యు.ఎస్. నుంచి వచ్చి అక్కినేని ఇంటర్నేషనల్ ఆఫ్ అమెరికా పేరుతో సంస్థను స్థాపించి వీరు చేస్తున్న కృషిని మనం గుర్తించి అభినందించాలి. ఇలాంటివారు ఇంత గొప్పగా చేస్తున్న ఈ వేడుకకు ఆహ్వానితులు రాకపోవడం నా దృష్టిలో అన్యాయం. వీళ్ళను ఆదర్శంగా తీసుకుని మనం కూడా ఇలాంటి మంచి పనిని చేయాలి’’ అని చెప్పారు. సంస్థ డైరక్టర్లలో ఒకరైన డా.శ్రీనివాస రెడ్డి ఆళ్ళ మాట్లాడుతూ “ బైపాస్ సర్జరీ చేయించుకున్న తర్వాత 40 ఏళ్ళ కాలం బతికిన అతి కొద్ది మందిలో ఏఎన్నార్ ఒకరు. పరిపూర్ణమైన జీవితాన్ని గడిపారాయన’’ అని చెప్పారు. ఎఎఫ్ఎ ఉపాధ్యక్షుడు రవికొండబోలు మాట్లాడుతూ “వచ్చే ఏడాది ఈ కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహిస్తాం. నేను అక్కినేని గారి హృదయాన్ని నేను రెండు సార్లు చూశాను. ఆయనకు హృదయ పరీక్షలు చేయడం వల్ల అది సాధ్యమైంది. 24 రోజులు ఆయనతో గడిపాను. మహాభారతంలో సీరియల్లోని 92 ఎపిసోడ్లను ఆయన చాలా ఆసక్తిగా తిలకరించారు’’ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ఎ సెక్రటరీ శారద ఆకునూరి తదితరులు పాల్గొన్నారు. తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్యతో పాటు జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకోవాల్సిన సూపర్‌స్టార్ కృష్ణ, గోల్డెన హీరోయిన్లుగా పురస్కారాలను అందుకోవాల్సిన విజయ నిర్మల, జయప్రద, జయసుధ, సినీ రత్న పురస్కారాన్ని అందుకోవాల్సిన డా.కైకాల సత్యనారాయణ హాజరు కాలేదు.